ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 06.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈరోజు మెదక్ జిల్లాలో పర్యటించి నషా ముక్త్ భారత్ ర్యాలీతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.
2. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
3. ప్రధాని మోదీ జన్మదిన పురస్కరించుకుని చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు.
4. వచ్చే ఏడాది నాటికి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

------------------------------

**గవర్నర్ పర్యటన**

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నేడు మెదక్ జిల్లాలో పర్యటించి, నషా ముక్త్ భారత్ ర్యాలీ, విద్యార్థుల ముఖాముఖి, ఐడీవోసీలో మహిళా సంఘాల భేటీలలో పాల్గొంటారు. అలాగే రామాయంపేట - సిద్దిపేట జాతీయ రహదారి వెంట ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో చేపట్టే 35 వేల జీడిమామిడి మొక్కల పెంపకం కార్యక్రమాన్ని గవర్నర్ రేపు ప్రారంభించనున్నారు.

**డెస్క్**

-----------------------------------

**భట్టి విక్రమార్క**

రాష్ట్రంలో విద్యుత్ కొరత తీర్చేందుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో ఉన్న పులిచింతల జల విద్యుత్ కేంద్రాన్ని మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అ డ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో పరిశీలించారు.. ఈ సందర్భంగా అక్కడి జెన్కో అధికారులతో సమావేశమై విద్యుత్ ఉత్పత్తి , పంపిణీ, నీటి లభ్యత తదితర అంశాలపై చర్చించారు.. అనంతరం సూర్యాపేట జిల్లాలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వద్ద 200 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రులతో కలిసి ఉపముఖ్యమంత్రి పరిశీలించారు.

**పీటీసీ – నల్గొండ**

--------------------------------

**సేవా సంకల్ప్ అభియాస్**

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోంది. ఈ సేవా మాసంలో భాగంగా ప్రతి గడపకూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సందేశాన్ని తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. ఇందులో భాగంగా మెట్టుగూడలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో రహదారి భద్రతపై చైతన్య కార్యక్రమా న్ని నిర్వహించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. మోదీ గారి ఆశయాలకు అనుగుణంగా సమాజసేవే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా, రేపు ఖైరతాబాద్‌లో నిర్వహించే 'సేవా జ్యోతి యాత్ర 'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

డెస్క్

-----------------------------

**రామచందర్ రావు**

ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా SIRపై నిర్ణయాలు తీసుకున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ , ఇండీ కూటమి నేతలు ఎన్నికల సంఘం , SIR విధానంపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. SIRపై ఎన్నికల సంఘం తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తుచేశారు. 1952 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలనలోనే 12 సార్లు SIR జరిగిందని, ఓడిపోయినప్పుడల్లా ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

**MSM**

--------------------------------

**కరీంనగర్ - దసరా నవరాత్రి ఉత్సవాలు**

కరీంనగర్ శ్రీ మహాశక్తి దేవాలయంలో ఈనెల 11 నుండి 20 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యవేక్షణలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పది రోజుల పాటు వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం , అన్నదానం, దాండియా వంటి ప్రత్యేక కార్యక్రమాల ను నిర్వహించనున్నారు. భక్తులందరూ ఈ వేడుకలకు భారీగా తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

**పీటీసీ - కరీంనగర్**

---------------------------

**కల్వకుంట్ల కవిత**

బ్యాంకు ఉద్యోగులపై పనిభారం తీవ్రంగా ఉందని , వారి దీర్ఘకాలిక డిమాండ్ అయిన వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. ఇది వీలుకాని పక్షంలో బ్యాంకులు ఏడు రోజులూ నడిచేలా ఉద్యోగులకు షిఫ్ట్ విధానం ప్రవేశపెట్టాలని సూచించారు. శనివారాల సెలవుల వల్ల ఉత్పాదకత ఏమాత్రం తగ్గలేదని ఒక వీడియో సందేశంలో తెలిపారు.

**డెస్క్**

-------------------------------

మధుయాష్కీ **గౌడ్**

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ మధుయాష్కీ గౌడ్ ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల నిపుణులను ఏకం చేసి , పాలసీ మేకింగ్, దేశ నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసేందుకు ఆరు నెలల్లో స్థానిక స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**డెస్క్**

--------------------------------

**పొన్నం ప్రభాకర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని పరివేద గ్రామంలో నిర్వహించిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి , 50 లక్షల రూపాయలతో చేపడుతున్న సీసీ రోడ్లు , 1.70 కోట్ల రూపాయలతో నూతన రహదారి నిర్మాణాలను ప్రకటించారు. అలాగే పశువులకు మందులు, కళ్యాణలక్ష్మి చెక్కులు , ఉచిత విద్యుత్ , ఇందిరమ్మ ఇళ్లు వంటి పలు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఏడాది నాటికి గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

**పీటీసీ - సిద్దిపేట**

----------------------------

**కేటీఆర్**

తన పాస్‌పోర్టు జప్తునకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందంటూ సెప్టెంబర్ 29న ఒక పత్రికలో వచ్చిన కథనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు సదరు పత్రికకు లీగల్ నోటీసు పంపారు. కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని , కేవలం ఏసీబీ మెమో మాత్రమే దాఖలు చేసిందని ఆయన న్యాయవాది స్పష్టం చేశారు. ఆ తప్పుడు వార్తను 48 గంటల్లోగా

ఉపసంహరించుకుని, క్షమాపణలు చెప్పాలని , లేని పక్షంలో క్రిమినల్ పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

డెస్క్

-----------------------------------

**తాగునీరు**

హైదరాబాద్ నగరంలో తాగునీటి నాణ్యతపై ప్రచారంలో ఉన్న వీడియోలోని నమూనాలు భూగర్భజలాలకు సంబంధించినవేనని, జలమండలి సరఫరా చేసే శుద్ధి చేసిన నల్లాల నీరు కాదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితుల వల్ల భూగర్భజలాల్లో టీడీఎస్ , ఫ్లోరైడ్ ప్రమాణాలు మారవచ్చని, ఆ ఫలితాలను జలమండలి తాగునీటికి అన్వయించడం సరికాదని స్పష్టం చేశారు.

డెస్క్

------------------------------

**కబడ్డీ పోటీలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నాలుగు రోజుల పాటు అట్టహాసంగా జరిగిన రాష్ట్ర స్థాయి బాల , బాలికల కబడ్డీ పోటీలు నిన్న రాత్రి ముగిశాయి. ఉత్కంఠ భరి తంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో బాలుర విభా గంలో నల్గొండ జిల్లా జట్టు వనపర్తి జిల్లా జట్టు పై 46-30 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు ఖమ్మం జిల్లా జట్టు పై 48-24 పాయింట్ల తేడాతో విజయ దుందుబి మోగించింది. ఫైనల్ విజేతలు నల్గొండ , కొత్తగూడెం జట్లకు రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చేతులమీదుగా కప్, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ....

**బైట్ - పొన్నం ప్రభాకర్**

ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ......

**బైట్ – ఆది శ్రీనివాస్**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-------------------------------

**కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్**

పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వ ం అమలు చేస్తోందని జనగామ జిల్లా పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో 54 మంది లబ్ధిదారులకు 54 లక్షల 864 రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

**పీటీసీ - జనగామ**

-------------------------------------------

ఖమ్మం

ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో , రాష్ట్ర ప్రభుత్వం ఏడు గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాలను ప్రోత్సహిస్తూ , ఆయా రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు ఐదు వందల రూపాయల బోనస్ అందించనున్నట్లు ఖమ్మం జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య చెప్పారు. ఈరోజు ఖమ్మం లో విలేకరులతో మాట్లాడుతూ , రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ సక్రమంగా అందేలా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గుర్తింపు పొందిన సన్న ధాన్యం రకాల గుర్తింపు, ధృవీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

**పీటీసీ – ఖమ్మం**

----------------------------

**సమాచార హక్కు చట్టంపై అవగాహన వారోత్సవాలు**

ఈ నెల 12 వరకు సమాచార హక్కు చట్టంపై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా అధికారులందరూ వారి వద్ద పెండింగ్లో ఉన్న సమాచార హక్కు చట్టం దరఖాస్తులు, అప్పీల్ దరఖాస్తులపై నిర్దేశించిన ప్రొఫార్మాలో సమాచారం ఇవ్వాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.. సంచార్ హక్కు వారోత్సవాల పై జిల్లా కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో శాఖల వారీగా గత ఏడాది కాలంలో వచ్చిన దరఖాస్తులు , వాటికి ఇచ్చిన సమాచారం , పెండింగ్ దరఖాస్తులు , వాటికి గల కారణాలపై కలెక్టర్ సమీక్ష జరిపారు.

**పీటీసీ – నల్గొండ**

---------------------

**బీర్ల ఐలయ్య**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం దత్తాయిపల్లిలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు , ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సందర్భంగా ఆయన ప్రజలను అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.

**పీటీసీ - యాదాద్రి భువనగిరి**

-----------------------------